సాక్షి
సంగారెడ్డి
బుధవారం ׀ 28 ׀ ఆగస్టు ׀ 2024



ఆహ్లాదం.. ఆమడదూరం..!

పట్టణ శివారులో నిర్మించిన అర్బన్ పార్కు పనులు అర్ధంతరంగా నిలిచాయి.

వివరాలు 8లో ▸



రెచ్చిపోతున్న సైబర్ కేటుగాళ్లు

సైబర్ కేటుగాళ్లు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. స్టాక్ మార్కెట్, టాస్క్‌ల పేరిట ప్రజలను మోసం చేస్తున్నారు.

వివరాలు 8లో ▸

సదరం క్యాంపు.. 28మంది హాజరు

సంగారెడ్డి: పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో మంగళవారం సదరం క్యాంపు నిర్వహించారు. 200 మంది హాజరు కావాల్సి ఉండగా 28 మంది వచ్చినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్ కుమార్ తెలిపారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో నేడు 'సాక్షి' ఫోన్‌ఇన్

సంగారెడ్డి : ప్రస్తుత వర్షాలకు జిల్లాకేంద్రం సంగారెడ్డితో పాటు పరిసర గ్రామాల ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు 28న (బుధవారం) 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం చేపడుతోంది. రోగాల వ్యాప్తి, జ్వర బాధితులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సంగారెడ్డి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనీల్‌కుమార్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.





అనిల్ కుమార్

అంశం: రోగాల వ్యాప్తి.. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై..
తేదీ: 28-08-2024 (బుధవారం)
సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
98495 71346/ 99083 22511

న్యూస్‌రీల్

పాఠశాలల్లో ట్రైనీ కలెక్టర్ తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని పాఠశాలలను ట్రైనీ కలెక్టర్ మనోజ్ మంగళవారం తనిఖీ చేశారు. గొంగ్లూర్, సింగూరు గురుకుల పాఠశాలలు, కస్తూర్బా బాలికల పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో పాఠాలు చదివించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. గొంగ్లూర్ అంగన్‌వాడీ స్కూల్‌లో చిన్నారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

లోపాయికారి ఒప్పందంతోనే కవితకు బెయిల్



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరు: బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం చేసుకోవడంతోనే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. లిక్కర్ స్కాం కేసులో ఐదు నెలలుగా జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడం కోసం 15 రోజులుగా ఢిల్లీలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు బీజేపీ నాయకుల ఇళ్లలో తిష్ట వేశారని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు యువరాజ్ మోరే, నాయకులు సాయిలు ముదిరాజ్, అక్షిత్, సిద్దేశ్వర్, మల్లేష్ పాల్గొన్నారు.

డంప్ యార్డును తరలించండి



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

సంగారెడ్డి టౌన్: మండల పరిధిలోని ఫసల్వాది గ్రామ శివారులో ఉన్న మున్సిపాలిటీ డంప్ యార్డును అక్కడి నుంచి తరలించాలని తాండవాసులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంప్ యార్డు నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నామని తెలిపారు.

సింగూరు ప్రాజెక్టుకు 3411 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. మంగళవారం డ్యాంలోకి 3411 క్యూసెక్కుల వరద నీరు చేరింది. రెండు రోజులుగా జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో కురిసిన వర్షం నీరంతా డ్యాంలోకి చేరుతుంది. ప్రాజెక్టు సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.907టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శంభుని కుంట.. హాంఫట్

14 ఎకరాల వరకు ఆక్రమణలు



ఆక్రమణలకు గురైన అమీన్‌పూర్ శంభునికుంట

- 22.80 ఎకరాల నుంచి సుమారు 8 ఎకరాలకు పడిపోయిన విస్తీర్ణం
- హైడ్రాకు అమీన్‌పూర్ వాసుల ఫిర్యాదు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమీక్షలో ఈ కుంట కబ్జాపై ప్రస్తావన

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అమీన్‌పూర్ పట్టణంలోని నడిబొడ్డున ఉన్న శంభుని కుంట కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కలకలలాడే ఈ కుంట.. ఇప్పుడు పూర్తిగా ఆక్రమణలకు గురైంది. విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలతో ఈ కుంట కాస్త కుచించుకుపోయింది. హెచ్ఎండీఏ లేక్ జాబితాలో ఉన్న ఈ చెరువు విస్తీర్ణం మొత్తం 22.801 ఎకరాలు. అయితే రోజురోజుకూ పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలతో ఏకంగా ఈ కుంట విస్తీర్ణం కేవలం ఎనిమిది ఎకరాలకు పడిపోయింది. అంటే సుమారు 14 ఎకరాల వరకు ఈ కుంట కబ్జాలకు గురైనట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రం ఇప్పుడు చెరువులు, కుంటల కబ్జాలపై హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శంభుని కుంట ఆక్రమణలపై స్థానికులు పెద్ద ఎత్తున హైడ్రాకు ఫిర్యాదు చేశారు. నీటి పారుదల శాఖ రికార్డులు, మ్యాపులు, సరైన ఆధారాలతో ఈ కుంట కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదులు వెళ్లాయి. ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల అమీన్‌పూర్ పట్టణంలోని కబ్జాలకు గురైన చెరువులను స్వయంగా పరిశీలించారు. రెండు సార్లు ఆయన ఈ ప్రాంతాలను సందర్శించారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షలో శంభుని కుంట కబ్జాల అంశం ప్రధానంగా చర్చకొచ్చినట్లు నీటిపారుదలశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

2013లో నీటిపారుదలశాఖ, రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు నిర్వహించిన సర్వే ప్రకారం శంభునికుంట వివరాలు ఇలా..

నీటి వనరు : శంభునికుంట (దేవునికుంట)
కుంట ఎఫ్‌టీఎల్ : 22.801 ఎకరాలు
కుంట నీటిమట్టం : 541.91 మీటర్లు
కుంట కట్ట పొడవు : 250 మీటర్లు

రూ.వందల కోట్ల విలువ చేసే భూములవీ..

అమీన్‌పూర్ పట్టణం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. నగరంలో వివిధ చోట్ల ఉద్యోగాలు చేసుకునే వారు, ఐటీ నిపుణులు ఎక్కువగా ఈ ప్రాంతంలో నివసిస్తుంటారు. దీంతో ఇక్కడి భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఇక్కడ గజం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతోంది. దీంతో అక్రమార్కుల కన్ను అమీన్‌పూర్ శంభుని కుంటపై పడింది. రూ.వందల కోట్లు విలువ చేసే ఈ కుంట స్థలాన్ని క్రమంగా ఆక్రమిస్తూ వచ్చారు. ఇక్కడ రెండు వందల గజాల నివాస స్థలం కొనుగోలు చేయాలంటే సుమారు రూ.కోటి వరకు వెచ్చించాల్సిన పరిస్థితి. ఈ లెక్కన కబ్జాకు గురైన సుమారు 14 ఎకరాల కుంట భూమి విలువ రూ.వందల కోట్లలో ఉంటుందని అంచనా వేయవచ్చు.

ఇండ్లలోకి వరద నీరు..

శంభునికుంట కబ్జాకు గురికావడంతో ఈ కుంటలో చేరాల్సిన వర్షం నీరు సమీపంలోని ఇండ్లలోకి వస్తోంది. జయలక్ష్మినగర్, సాయికాలనీ, మల్లికార్జున కాలనీ, వందనపురి కాలనీలు జలమయం అవుతున్నాయి. వర్షం పడితే చాలు తమ కాలనీల్లోకి వరదనీరు వచ్చి చేరుతోందని స్థానికులు పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలోని నాలాలన్నీ పొంగి ప్రవహించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కబ్జా చేసింది నేతలే కావడం, వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు ఈ ఆక్రమణలకు వంత పాడటంతో స్థానికుల వేదన అరణ్య రోదనగా మారింది. హైడ్రా కుంటలు, చెరువుల కబ్జాలపై ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో శంభునికుంట ఆక్రమణలు తొలగిస్తారా? లేదా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మిన్నకుండి పోతారా అనేది వేచి చూడాల్సిందే.

ఆక్రమణల వెనుక నేతలు..

ఈ కుంట కబ్జాల వెనుక రాజకీయ నేతలే ఉండటం గమనార్హం. బడా నేతలు, వారి కుటుంబ సభ్యులు, వారి బినామీ పేర్లతో కబ్జాలకు పాల్పడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని విచ్చలవిడిగా ఈ కుంటను కబ్జా చేశారు. కళ్ల ముందే కుంట కబ్జాకు గురవుతున్నప్పటికీ అధికారులు 'మామూళ్ల'తో సరిపెట్టుకున్నారు. ఆక్రమణకు గురైన కుంట భూమిలో కట్టడాలకు అమీన్‌పూర్ మున్సిపాలిటీ అధికారులు అనుమతులు మంజూరు చేయడం గమనార్హం. కబ్జాలకు పాల్పడింది ప్రజాప్రతినిధులు, నేతలే కావడంతో కొన్నింటికి అనుమతులు కూడా కట్టబెట్టారు. దీంతో ఈ కుంటలో కబ్జాలకు అడ్డే లేకుండా పోయింది.

విష జ్వరాలపై స్పెషల్ డ్రైవ్



జోగిపేట ఆసుపత్రిలో రోగిని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

- ఇంటింటికీ వెళ్లి అవగాహన
- మున్సిపాలిటీల్లో త్రీమెన్ కమిటీ
- కలెక్టర్ వల్లూరి క్రాంతి
- జోగిపేట ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ
- సిబ్బంది తీరుపై అసంతృప్తి

జోగిపేట(అందోల్): రాష్ట్ర వ్యాప్తంగా విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, మున్సిపాలిటీల్లో ప్రతీ రోజు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'త్రీమెన్ కమిటీ'లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ క్రాంతి తెలిపారు. మంగళవారం జోగిపేట ఏరియా ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కమిటీలో మెప్మా నుంచి రిసోర్ పర్సన్, వైద్యశాఖ నుంచి ఆశా వర్కర్, మున్సిపాలిటీ నుంచి స్పెషల్ ఆఫీసర్‌లు ఉంటారని తెలిపారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.

డాక్టర్లు పట్టించుకోవడం లేదు మేడం..

''డాక్టర్లు సరిగ్గా చూడడం లేదు మేడం.. రాత్రిపూట డ్యూటీ డాక్టర్ ఇన్ పేషంట్లను పట్టించుకోవడం లేదు'' అని పలువురు రోగులు కలెక్టర్‌తో వాపోయారు. ఈ విషయంపై అక్కడే ఉన్న సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్యను ప్రశ్నించారు. నర్సులు వెళ్లి చూస్తున్నారని సమాధానం ఇవ్వడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సులు చూశాక మీరెందుకు అని మండిపడ్డారు.

అందోల్‌లో డ్రైడే

అందోల్‌లోని ఐదవ వార్డులో కలెక్టర్ ఇంటింటికి తిరుగుతూ శానిటేషన్ డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని కమిషనర్ తిరుపతిని ఆదేశించారు. అంతకుముందు అందోల్‌లోని బస్తీ దవాఖానను ఆమె తనిఖీ చేశారు. డాక్టర్, నర్సులకు డ్రెస్ కోడ్ లేకపోవడంపై సీరియస్ అయ్యారు.

పండగలు శాంతియుతంగా జరుపుకోవాలి



అధికారులను వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీసీపీ వినీత్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పండగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని రాయసముద్రం చెరువు వద్ద వినాయక నిమజ్జన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా గణపతులు వచ్చే మార్గాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. వినాయక నిమజ్జనం రోజు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వినాయక మండపాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మియాపూర్ ఏసీపీ నరసింహారావు, కార్పొరేటర్ పుష్పనగేష్, ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్, ఎస్ఐ శశికాంత్ రెడ్డి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



వైద్య సేవల గురించి డీసీహెచ్ఎస్ ఆరా

జహీరాబాద్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ సంగారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఐసీయూలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యుల పనితీరుపై ఆరా తీశారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా శ్రద్ధ చూపాలని సూచించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

జహీరాబాద్ టౌన్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ సొంత ఇల్లు లేని పేదలు పట్టణంలో చాలామంది ఉన్నారని, వారందరికీ స్థలాలు కేటాయించాలని ఐదేళ్లుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 71/1 లోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ భూమిని పేదలకు పంచాలని కోరారు.

సంగారెడ్డిలో భారీ వర్షం

సంగారెడ్డి టౌన్: పట్టణంలో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమై ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం కురుస్తున్న వానలు పంటలకు మేలు చేస్తుందని పరిసర గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

దళారులను ప్రోత్సహించొద్దు

బ్యాంకర్లకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచన



బ్యాంకర్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: బ్యాంకర్లు దళారులను ప్రోత్సహించవద్దని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా కాంగ్రెస్ సర్కార్ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. ఈ విషయంలో బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. రుణమాఫీకి సంబంధించిన సమస్యలు త్వరగా పరిష్కరించాలన్నారు. డిపాజిట్లు, బీమాలపై వత్తిడి తేవద్దన్నారు. రైతుమిత్రలు ఎక్కువ కమిషన్ వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, వారు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. రుణమాఫీ డబ్బులు కొందరు రైతులకు తగ్గించి ఇస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులను ప్రస్తావించారు. పైరవీకారులకు బ్యాంకుల్లో ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదని సూచించారు. లీడ్‌బ్యాంకు మెనేజరు గోపాల్‌రెడ్డి, ఆర్డీఓ అశోకచక్రవర్తి, డీసీసీబీ జీఎం శ్రీనివాస్, నాబార్డు జిల్లా అధికారి కృష్ణతేజ, నియోజకవర్గంలోని వివిధ బ్యాంకుల మెనేజర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు. అదేవిధంగా ఖేడ్, నిజాంపేట మండలాలకు సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. నాగల్‌గిద్ద, మనూరు మండలాల్లోనూ కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కరసగుత్తి పీహెచ్‌సీలో నూతన అంబులెన్స్‌ను ప్రారంభించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



డీకే అరుణకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

జహీరాబాద్: భూ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని సత్వార్ గ్రామానికి చెందిన రైతులు వక్ఫ్‌బోర్డు సభ్యురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. గ్రామానికి చెందిన 859 ఎకరాల భూములను వక్ఫ్‌బోర్డు కిందకు చేర్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తాత ముత్తాతల కాలం నుంచి ఈ భూములను సాగు చేసుకుంటున్నామని, ఐదేళ్ల క్రితం వక్ఫ్ భూములంటూ ధరణి పోర్టల్‌లో చేర్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. డీకే అరుణ స్పందిస్తూ.. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానన్నారు. ఎంపీని కలిసిన వారిలో సత్వార్ పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు అన్వీర్, అనూష్‌రెడ్డి, వెంకట్, ఉస్మాన్‌అలీ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకుందాం

మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు సూచించారు. మంగళవారం బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీకృష్ణుని ఆలయంలో జరిగిన శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్, కార్పొరేటర్ పుష్పనగేష్, వ్యాపారవేత్తలు ఆరవ రామకృష్ణ, శ్రీధర్ యాదవ్, నాయకులు బలరాం, సంతోష్ గౌడ్, అర్చకులు భార్గవ లక్ష్మీనరసింహస్వామి పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో ఆగస్టు 29న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నాకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 2.50 లక్షల మంది రైతులు ఉంటే, ఇప్పటి వరకు మూడు విడతలలో 97,873 మందికి రూ.846.31కోట్ల రుణమాఫీ మాత్రమే అయ్యిందన్నారు. రేషన్ కార్డు పరిగణనలోకి తీసుకోవడంతో వేలాది మందికి రుణమాఫీ కాలేదని తెలిపారు. టెక్నికల్ సమస్యను సాకుగా చూపి రుణమాఫీ చేయకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య, మాణిక్యం, సాయిలు, నాయకులు పి.అశోక్, విఠల్ పాల్గొన్నారు.

పక్కాగా పశుగణన

- సర్వే నిర్వహణకు సన్నద్ధం
- సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభం
- ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం
- 29న అవగాహన సదస్సు
- ఇంటింటికీ తిరిగి వివరాల సేకరణ



సంగారెడ్డి జోన్: ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే పశుగణన చేపట్టేందుకు పశు సంవర్థక శాఖ సన్నద్ధం అవుతుంది. సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు సర్వే నిర్వహించడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 647 గ్రామ పంచాయతీల పరిధిలో పశుజాతుల వివరాలు సేకరించనున్నారు. గ్రామాలకు వెళ్లి ఇంటింటికి తిరిగి గేదెలు, గొర్రెలు, ఆవులు, మేకలు, కుక్కలు, కోళ్లతో పాటు వివిధ రకాల పశువుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

సర్వేకు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు

నాలుగు నెలల పాటు ఈ పశుగణన కొనసాగనుంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 90 మంది ఎన్యుమరేటర్లు, 30 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు పశుసంవర్థక శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నెల 29న పశుగణన చేపట్టే అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

అంతా ఆన్‌లైన్‌లోనే..

పశుగణనలో భాగంగా సేకరించిన వివరాలను వెంటనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌లో నమోదు చేస్తారు. గతంలో ఇంటింటికీ తిరిగి పశువుల వివరాలు సేకరించి, సంబంధిత కార్యాలయానికి వచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. కానీ ఇప్పుడు వివరాలు తెలుసుకోగానే వెంటనే యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. పశుగణన చేపట్టే సిబ్బందికి ఒక్కో కుటుంబం చొప్పున అదనంగా ఇన్సెంటివ్ ఇవ్వనున్నారు.

పకడ్బందీగా వివరాల సేకరణ

జిల్లాలో పశువుల వివరాలు పకడ్బందీగా సేకరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ ఐదేళ్లకు ఒకసారి దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం పశుగణన చేపడుతుంది. 2023లో పశుగణన జరగాల్సి ఉండగా ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడినట్లు సమాచారం. పాడి పరిశ్రమ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాలు అందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తారు. పశువుల తోపాటు యజమానుల వివరాలు కూడా సేకరించనున్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 20 సార్లు పశుగణన చేపట్టారు.

20వ పశుగణన వివరాలు

ఆవులు, ఎద్దులు	1,56,282
బర్రెలు	1,68,995
గొర్రెలు	4,38,475
మేకలు	2,29,311
పందులు	6,353
కోళ్లు	12,24,576
కుక్కలు	13,486

పశుగణనకు సహకరించాలి



జిల్లా వ్యాప్తంగా 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభమవుతుంది. సర్వేకు వచ్చే అధికారులకు పశువుల యజమానులు వివరాలు తెలిపి సహకరించాలి.

– డాక్టర్ ఎం.వసంతకుమారి, పశుసంవర్ధక శాఖ అధికారి, సంగారెడ్డి

క్లుప్తంగా

అంతర్జాతీయ కరాటే పోటీల్లో చేర్యాల విద్యార్థుల ప్రతిభ



చేర్యాలకు చెందిన విద్యార్థులతో పాషా

చేర్యాల(సిద్దిపేట): అంతర్జాతీయ కరాటే పోటీల్లో చేర్యాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఫెడరేషన్ రాష్ట్ర టీం కోచ్ సెన్సాయి ఎంఎస్.పాషా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కత్తా స్కాట్ గార్డెన్లో మూడు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో చేర్యాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగిన పోటీల్లో 18 దేశాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొనగా.. చేర్యాలకు చెందిన సీహెచ్.రాజ్‌కుమార్, సీహెచ్.అభినవ్‌లు 13–17 ఏళ్లలోపు విభాగంలో కాంస్య పతకాలు గెలుచుకున్నారని తెలిపారు. ఫెడరేషన్ చైర్మన్ తకాశి యామగుచి చేతుల మీదుగా సోమవారం రాత్రి బెల్టులు, జ్ఞాపికలను అందుకున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న చిన్నారి



ఉస్మానియాలో చికిత్స పొందుతున్న హన్సిత

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని బేగంపేటలో కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న చిన్నారి హన్సిత హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. హన్సిత తలకు డాక్టర్లు శస్త్ర చికిత్స చేసినట్లు చిన్నారి తల్లిదండ్రులు దేవేందర్, లాస్య 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు. చిన్నారి పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని, ప్రభుత్వం స్పందించి మెరుగైన చికిత్స అందించాలని వారు వేడుకుంటున్నారు.

డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 23 మందికి జరిమాన

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 23 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 2 వేల చొప్పున జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం, సోమవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 23 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, న్యాయమూర్తి పై జరిమాన విధించినట్లు తెలిపారు.

అదృశ్యమై.. శవమై తేలి..



కోల సుధీర్ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): అదృశ్యమైన ఓ యువకుడు కుంటలో శవమై కనిపించాడు. ఈ సంఘటన మండలంలోని తునికి హరిచంద్‌తండా పంచాయతీ పరిధిలోని దేవులతండాలో చోటుచేసుకుంది. ఎస్ రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం.. దేవులతండాకు చెందిన కోల లక్ష్మి పెద్దకొడుకు కోల సుధీర్(25) ఇంటర్ పూర్తిచేసి ప్రస్తుతం మేకలను మేపడంతోపాటు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో రాత్రి కుటుంబ సభ్యులు వెతకగా ఆచూకి లభించలేదు. మంగళవారం ఉదయం తండా సమీపంలోని అడవివద్దగల పుల్చెరుకుంట వద్ద అతని చెప్పులు ఉండటంతో తండావాసులు, కుటుంబ సభ్యులు కుంటలో వెతకగా.. సుధీర్ మృతదేహం లభించింది. కేసు దర్యాప్తులో ఉంది.

లైసెన్స్ కార్డుల కటకట

- ఏడాది నుంచి వాహనదారుల ఎదురుచూపులు
- కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- వాహనదారులు రోడ్డెక్కితే జరిమానాలు
- త్వరలో యూనిట్ ఆఫీస్ వారీగా కార్డుల జారీ
- ఇన్‌చార్జి డీటీవో కొండల్ రావు



హుస్నాబాద్: ఏడాదైనా లైసెన్సు కార్డులు అందక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వాహనాలకు రిజిస్ట్రేషన్లు, లైసెన్స్ కార్డులు తప్పనిసరిగా ఉండాలని అధికారులు చెబుతున్నా.. కార్డులు సకాలంలో పంపిణీ చేయడంలో విఫలమవుతున్నారు. వాహనం కొత్త రిజిస్ట్రేషన్లు, ట్రాన్స్‌పోర్టు, నాన్ ట్రాన్స్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్‌లు వంటి సేవలు పొందిన వాహనదారులకు రవాణాశాఖ నుంచి కార్డులు జారీ కావాల్సి ఉంటుంది. రవాణా సేవలు పొందిన వాహనదారులకు 24 గంటల్లోనే వాహన పత్రాలు ఇస్తామని ఆ శాఖ కార్యాలయంలోని సిటిజన్ చార్ట్‌లో స్పష్టంగా కనబడుతుంది. అయితే..ఈ విధానం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడే స్మార్ట్ కార్డుకు రూ.200, పోస్టల్ చార్జి కింద రూ.25 ముందుగానే అధికారులు వసూలు చేస్తున్నారు. వివిధ రకాల కార్డులు పోస్టల్ ద్వారా వాహనదారుడి అడ్రస్‌కు పంపించాలి. లేదంటే వాహనదారుడు కార్యాలయానికి వెళ్లి స్వయంగా తీసుకోవాల్సి ఉంటుంది.

దాదాపు ఏడాది గడుస్తున్నా ఇంత వరకు లైసెన్స్ కార్డులు రాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కార్యాలయానికి వెళితే.. సరైన సమాధానం రావడం లేదని వారు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఎస్ 4 ద్విచక్రవాహనాలకు రిజిస్ట్రేషన్లు చేసేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీఎస్ నుంచి టీజీగా మారిన తర్వాత ట్రాన్స్‌పోర్ట్ వెబ్‌సైట్‌లో వెహికిల్ ఇన్‌స్పెక్షన్ కాలం తొలగించారు. దీంతో వందలాది మందికి చెందిన బీఎస్ 4 బైక్‌లకు రిజిస్ట్రేషన్లు కావడం లేదు. దీంతో వాహనదారులు రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా ఫలితం కనబడటం లేదు.

జాబితాను సిద్ధం చేస్తున్నాం



పోస్టల్ ద్వారా లైసెన్స్ కార్డుల జారీలో ఆలస్యం అవుతుందన్న మాట వాస్తవమే. కొన్ని తిరిగి వస్తున్నాయి కూడా. లైసెన్స్ కార్డులు రాని వారి వాహనదారుల జాబితాను తయారు చేస్తున్నాం. యూనిట్ ఆఫీస్‌ల వారిగా అక్కడే లైసెన్స్ కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే యూనిట్ ఆఫీస్ వారీగా లైసెన్స్ కార్డులను జారీ చేస్తాం.

– ఇన్‌చార్జి డీటీఓ కొండల్‌రావు, సిద్దిపేట

రోడ్డెక్కాలంటే జంకుతున్న వాహనదారులు

లైసెన్స్ కార్డులు లేకపోవడంతో వాహనదారులు రోడ్కెక్కాలంటే జంకుతున్నారు. పోలీసులు ఎక్కడ వాహనాలు ఆపుతారోనని ఆందోళన చెందుతున్నారు. వాహనాలకు రిజిస్ట్రేషన్లు ఉన్నప్పటికీ లైసెన్స్, ఆర్‌సీ కార్డులు లేవని పోలీసులు వాహనాలను ఆపి జరిమానాలు విధిస్తున్నారు. అధికారుల తప్పిదంతో పోలీసుల నుంచి తప్పించుకొని వాహనాలు నడుపుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే డూప్లికేట్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు ఉచిత సలహా ఇస్తున్నారు. ముందుగానే స్మార్ట్‌కార్డు, పోస్టల్ చార్జీలు తీసుకుంటున్న అధికారులు.. కార్డుల జారీలో ఎందుకు జాప్యం చేస్తున్నారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

రెచ్చిపోతున్న సైబర్ కేటుగాళ్లు

- స్టాక్‌మార్కెట్ పేరిట రూ.6.19 లక్షలు..
- టాస్కుల పేరుతో రూ.2.05లక్షలు పోగొట్టుకున్న వైనం



పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. స్టాక్‌మార్కెట్ పేరిట ఒకరిని, టాస్కులు పేరిట మరొకరు సైబర్ వలలో చిక్కుకొని డబ్బులు పోగొట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగికి చెందిన ఓ వ్యక్తికి జూలై 7 వ తేదీన వాట్సాప్ ద్వారా స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. వారి సూచన మేరకు తన వివరాలను నమోదు చేశారు. దీంతో అపరిచిత స్టాక్ మార్కెట్ నిర్వాహకులు ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు. అతని నగదు ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. పెట్టిన పెట్టుబడి, లాభాలు చూపిస్తూ వచ్చారు. మొత్తం 13 లావాదేవీల్లో రూ.6 లక్షల 19 వేలు ఇన్వెస్ట్ చేశాడు. దీంతో బాధితుడు తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడగగా.. అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

టాస్కుల పేరిట

టాస్కులు కమీషన్ పేరిట జరిగిన సైబర్ మోసంలో ఓ వ్యక్తి రూ.2.05లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐటిడబ్ల్యూసిగ్నోడ్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి ఏప్రిల్ 30న పార్ట్‌టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. అతను తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.2 లక్షల 5 వేలు చెల్లించాడు. అనుమానం రాకుండా సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమీషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్ఐసీ డబ్బులు వేస్తానని..

- బసంత్‌పూర్‌లో సైబర్ మోసం
- లింక్ నొక్కడంతో రూ.99 వేలు ఖాళీ
- మరోచోట పాతనాణేల పేరిట ఇదే తరహా మోసం

న్యాల్‌కల్(జహీరాబాద్): సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ చాలా మంది అమాయకులు మోసాలకు గురవుతూనే ఉన్నారు. తాజాగా న్యాల్‌కల్ మండలం బసంత్‌పూర్, శంశల్లాపూర్ గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు సైబర్ నేరస్తుల వలలో పడి రూ.1.98లక్షలు పోగొట్టున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బసంత్‌పూర్ గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డికి రెండు రోజుల క్రితం అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి నీకు ఎల్ఐసీ నుంచి డబ్బులు వచ్చాయి. నీ అకౌంట్ వివరాలు చెబితే డబ్బులను అకౌంట్‌లో వేస్తానని నమ్మబలికాడు. వివరాలు చెప్పినప్పటికీ అకౌంట్‌లో డబ్బులు లేవని నీ దగ్గర ఎవరైనా ఉంటే వారి అకౌంట్ వివరాలు ఇస్తే వారి ఖాతాలో వేస్తానని అపరిచిత వ్యక్తి చెప్పాడు. అక్కడే ఉన్న సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి తన అకౌంట్ వివరాలు చెప్పాడు. అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి నీకు లింక్ పంపాను.. అది క్లిక్ చేస్తే నీ అకౌంట్‌లో డబ్బులు పడతాయని చెప్పాడు. దీంతో సుదర్శన్‌రెడ్డి తనకు వచ్చిన లింక్‌ను క్లిక్ చేయడంతో తన అకౌంట్లోంచి రూ.99వేలు ఖాళీ అయ్యాయి. ఇది గమనించిన బాధితులు తనకు ఫోన్ వచ్చిన నంబర్‌కు కాల్ చేయగా.. ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయిన బాధితులు మంగళవారం హద్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే.. శంశల్లాపూర్ గ్రామానికి చెందిన రామకృష్ణారావు పాటిల్ ఇటీవల బీదర్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. నీ దగ్గర ఉన్న పాత నాణేల ఫొటో తీసి పంపితే రూ.12లక్షలు ఇస్తానని చెప్పాడు. ఐతే అందుకు కొంత సొమ్ము ఖర్చవుతుందని దానిని నాకు పంపాలని తెలిపాడు. అందుకు అంగీరించిన పాటిల్.. తన వద్ద ఉన్న పాత నాణేలను ఫొటో తీసి పంపాడు. ఒకసారి రూ.10వేలు అకౌంట్‌కు వేశాడు. ఇవి సరిపోవు మళ్లీ వేయమన్నాడు అపరిచిత వ్యక్తి. ఇలా చివరి వరకు రూ.99వేలు వేశాడు. చివరకు అపరిచిత వ్యక్తి నుంచి డబ్బులు రాకపోగా ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో తాను మోసపోయానని తెలుసుకున్న పాటిల్ హద్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామానాయుడు తెలిపారు.

78 కిలోల గంజాయి పట్టివేత

నిందితుడి అరెస్టు, వాహనం స్వాధీనం



అష్రాఫ్‌తో పాటు గంజాయి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

మునిపల్లి(అందోల్): పుష్ప సినిమా తరహాలో టాటా సఫారీ వాహనం సీట్ల కింద 78 కిలోల ఎండు గంజాయిని కవర్ పాకెట్లలో పెట్టి తరలిస్తుండగా ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టుకున్నారు. మెదక్ డివిజన్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున 65వ నంబర్ జాతీయ రహదారి కంకోల్ టోల్‌ప్లాజా సమీపంలో విశ్వసనీయ సమాచారం మేరకు వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించగా.. గంజాయిని కవర్‌లో ప్యాక్ చేసి కారు సీట్ల కింద పెట్టిన విషయాన్ని గమనించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా ఇటవాకిలి గ్రామానికి చెందిన నిందితుడు అష్రాఫ్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కారుతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అష్రాఫ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



శ్రీశైలంలో బాలుడిని అప్పగిస్తున్న అశోక్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: తప్పిపోయిన బాలుడిని గుర్తించిన ఓ వ్యక్తి అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. జహీరాబాద్ పట్టణంలోని సాయిరాంనగర్ కాలనీకి చెందిన వీరభద్రయ్య స్వామి కుమారుడు శరణయ్యస్వామి(13) సిద్దార్థ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా స్కూల్‌కు సెలవు ఉండడంతో సోమవారం ఇంట్లో వెయ్యి రూపాయలు తీసుకొని వెళ్లిపోయాడు. జహీరాబాద్‌లో బస్సు ఎక్కి హైదరాబాద్‌కు చేరుకుని, అక్కడి నుంచి శ్రీశైలం వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు ఎక్కి కూర్చున్నాడు. అదే బస్సులో మొగుడంపల్లి మండలం మన్నాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి అన్న అశోక్‌రెడ్డి కూడా ఉన్నారు. కొంత దూరం వెళ్లిన తర్వాత బాలుడిని చూసి అశోక్‌రెడ్డికి అనుమానం వచ్చింది. బాలుడు జహీరాబాద్ ప్రాంతానికి చెందినట్లుగా ఉన్నాడన్న అనుమానంతో శరణయ్యస్వామి వద్దకు వెళ్లి మాటల్లో దించాడు. చదవాలని ఒత్తిడి తీసుకురావడంతో అమ్మానాన్నలకు చెప్పకుండా వచ్చానన్నాడు. వెంటనే అశోక్‌రెడ్డి జహీరాబాద్‌కు ఫోన్ చేసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. బాలుడిని వెంట తీసుకుని శ్రీశైలంలో స్వామి దర్శనం చేయించాడు. రాత్రంతా తన వద్దనే ఉంచుకుని మంగళవారం శ్రీశైలంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆర్మీ జవాను కన్నుమూత

రిమ్మనగూడలో విషాద ఛాయలు



జవాను శ్రీనివాస్(ఫైల్)



మృతుని భార్య కవితకు సంతాపం తెలుపుతున్న ఆర్మీ అధికారి

గజ్వేల్: సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడకు చెందిన ఆర్మీ జవాను సోమవారం రాత్రి మహారాష్ట్రలోని పుణేలో మృతి చెందారు. గ్రామానికి చెందిన గుండారం శ్రీనివాస్(40) రెండు నెలల క్రితం వరకు జమ్ము కాశ్మీర్‌లో విధులు నిర్వహించారు. అక్కడ విధుల్లో ఉండగానే అనారోగ్యం బారిన పడ్డాడు. ఈ క్రమంలో పుణేలోని కమాండ్ ఆసుపత్రికి సంబంధిత అధికారులు రెఫర్ చేశారు. చికిత్స పొందుతున్న శ్రీనివాస్.. సోమవారం రాత్రి 10.30గంటల ప్రాంతంలో మృత్యువాతపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆర్మీ అధికారులు.. పుణేలో గౌరవ లాంఛనాల అనంతరం మృతదేహాన్ని స్వస్థలం రిమ్మనగూడకు తీసుకొస్తున్నారు. మృతునికి భార్య కవిత, కుమారుడు భానుతేజ, కూతురు లాస్యప్రియ ఉన్నారు. శ్రీనివాస్ మరణవార్తతో రిమ్మనగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్టు

- ముగ్గురు రిమాండ్
- ఇద్దరు మైనర్లను తల్లిదండ్రులకు అప్పగింత



మాట్లాడుతున్న చేర్యాల సీఐ శ్రీను

కొమురవెల్లి(సిద్దిపేట): గంజాయి సేవిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ముగ్గురిని రిమాండ్‌కు తరలించి, ఇద్దరు మైనర్లను వారి తల్లిండ్రులకు అప్పగించారు. ఈ ఘటన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చేర్యాల సీఐ శ్రీను కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మంగళవారం ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ రాజు సిబ్బందితో కలసి దాసరం గుట్ట పరిసరాలో దాడులు చేయగా.. గంజాయి సేవిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారించగా అందులో ఇద్దరు మైనర్లు స్థానికులు కాగా వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామన్నారు. సిద్దిపేటకు చెందిన జంగం ఓంకార్, ఎండీ సమీర్, మంగునూరి నగేష్‌లను రిమాండ్ తరలించినట్లు తెలిపారు. వీరందరూ తరచూ చేర్యాల మండలం పోతిరెడ్డి పల్లికి చెందిన ప్రేమ్‌రాజ్ వద్ద గంజాయి కొనుగోలు సేవిస్తున్నట్లు చెప్పారు. అతన్ని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. నిందితుల వద్ద నుంచి 60 గ్రాములు గంజాయి, ఆరు సెల్‌ఫోన్‌లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ పోచయ్య

రేగోడ్(మెదక్): తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మండలంలోని మర్పల్లి గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ పోచయ్య కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మన్నె లక్ష్మి ఈనెల 22న మల్లన్న గుట్ట ఆశ్రమానికి వెళ్లింది. మంగళవారం తిరిగి ఇంటికి వచ్చేసరికి వేసిన తాళం వేసినట్లుగానే ఉండగా, ఇంట్లోని బీరువాలో ఉన్న రెండున్నర తులాల లాకెట్‌ను దొంగిలించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా క్లూస్ టీం ఆధారాలను సేకరించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆహ్లాదం.. ఆమడదూరం..!

- అర్ధంతరంగా అర్బన్ పార్కు పనులు
- నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభం
- నిధులు లేక మధ్యలో నిలిపివేత
- పార్కు కల నెరవేరేనా..!



నారాయణఖేడ్: అసంపూర్తి దశలో ఎంట్రీప్లాజా పనులు

నారాయణఖేడ్: ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం పంచుతూ వాకింగ్ ట్రాక్‌గా మార్చాలన్న ఉద్దేశంతో పట్టణ శివారులో నిర్మించిన అర్బన్ పార్కు పనులు అర్ధంతరంగా నిలిచాయి. ఎంతో ఆర్భాటంగా పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారు. నారాయణఖేడ్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలోని వెంకటాపూర్ శివారులోని అటవీశాఖ ప్రాంతాన్ని అర్బన్ పార్కుగా మార్చేందుకు నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రూ.1.80కోట్లు మంజూరు చేసింది. కొన్ని పనులు చేపట్టాక బిల్లుల చెల్లింపులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. దీంతో పట్టణవాసులకు అర్బన్ పార్కు ఆశలు కాస్త అడియాశలయ్యాయి.


జాతీయ రహదారి ఆనుకుని..

ఖేడ్ పరిధిలోని వెంకటాపూర్ నుంచి నర్సాపూర్ శివారు వరకు నాలుగు కిలోమీటర్ల మేర అర్బన్ పార్కుగా ఏర్పాటు చేయనున్న అటవీ ప్రాంతం నిజాంపేట– ఖేడ్– బీదర్ 161బీ జాతీయ రహదారి పక్కనే ఉంది. పనులు పూర్తి చేస్తే నారాయణఖేడ్ పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు వారాంతాలు, ఇతర సెలవు రోజుల్లో ఆహ్లాదకర వాతావరణంలో ఆనందంగా గడిపేందుకు అవకాశం ఉంటుంది. వాచ్‌టవర్ నుంచి ప్రకృతి అందాలను తిలకించవచ్చు. అర్బన్ పార్కు పూర్తి చేసే విషయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి స్పందించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఇవీ నిర్మాణాలు

నాటి సుమారు 450 ఎకరాల వరకు అటవీ ప్రాంతాన్ని అర్బన్ పార్కుగా మార్చాలని అప్పట్లో నిర్ణయించారు. ఇందుకోసం అడవి చుట్టూ ఫెన్సింగ్, నాలుగు కిలో మీటర్ల సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, ఎంట్రీ ప్లాజా, వాచ్‌టవర్, గజబ్‌గదిని నిర్మించాలి. పిల్లల కోసం ఆట పరికరాలు ఆమర్చాలి. అడవిలోపల రోడ్డు నిర్మించాలి. వీటిలో ఎంట్రీ ప్లాజాను కొంత మేరకు నిర్మించి వదిలేశారు. వాకింగ్ ట్రాక్, వాచ్‌టవర్, గజబ్‌గది తదితర పనులు ఇప్పటికీ ఆరంభించలేదు. సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారని అధికారులు చెబుతున్నారు. కాగా చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించిందన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. సిమెంట్ నిర్మాణాల్లో నాణ్యత లోపించడంతో అప్పుడే దెబ్బతింటున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



అర్బన్ పార్కు పనులు త్వరగా పూర్తి చేయాలి. పార్కు పనులు అసంపూర్తిగా నిలిచాయి. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. పట్టణ వాసులతోపాటు, చుట్టు పక్కల గ్రామాల వారికి అనుకూలంగా ఉంటుంది.

– పండరి, లింగాపూర్

నిర్మాణం చేపట్టాలి



పట్టణ శివారులో నిర్మిస్తూ అర్ధంతరంగా ఆపివేసిన అర్బన్ పార్కు పనులు తిరిగి చేపట్టాలి. పనులు మొదట్లో చురుగ్గా సాగిని మధ్యలో ఆపివేశారు. నాలుగేళ్లుగా పనులు ఆగాయి. అర్బన్ పార్కు పూర్తయితే పట్టణ వాసులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది.

– శశిధర్‌రెడ్డి, నారాయణఖేడ్

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

పురుగుల మందు తాగి..



ఆగారెడ్డి (ఫైల్)

కోహెడరూరల్(హుస్నాబాద్): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని పోరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బర్రె ఆగారెడ్డి(45) కొన్ని రోజులుగా మద్యానికి బానిసై భార్య మంజులతో తరుచూ గొడవలు పడుతున్నాడు. దీంతో భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకొని సిద్దిపేటలో నివసిస్తుంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఆగారెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు భార్యకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై..



భూపాల్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధి చండి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివన్నగారి భూపాల్(37) కొంత కాలంగా మద్యానికి బానిసై అప్పులు చేశాడు. అవికాస్త పెరిగాయి. వాటిని తీర్చే మార్గం కానరాలేదు. ఈ విషయమై కుటుంబ సభ్యులు పలుమార్లు మందలించినా ఎలాంటి మార్పు కనిపించలేదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు.

కుటుంబ కలహాలతో..



ప్రవీణ్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేటలో కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వెల్మల ప్రవీణ్ (33) కొంతకాలంగా ఆర్థిక, కుటుంబ సమస్యలతో సతమతమతం అవుతున్నాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఇంటిలోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఐదేళ్లలోపు కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.